ప్రజలకు మెరుగైన వైద్యం

- ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మెరుగైన వైద్యం అందించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. నాబార్డు నిధులు రూ.13.35 కోట్లతో స్థానిక రాయ్ సాహిబ్ మిడతల హంపయ్య ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నిర్మించిన 50 పడకల మాతాశిశు సంరక్షణ విభాగం (ఎంసీహెచ్) ప్రారంభోత్సవానికి శనివారం వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రంగయ్య మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం 'నాడు–నేడు' పథకం ద్వారా ప్రభుత్వం ఆస్పత్రులను కార్పొరేట్‌లకు ధీటుగా తీర్చిదిద్దుతోందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం ఉంటే, ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. గుంతకల్లు, గుత్తి, పామిడి ఆస్పత్రుల్లో దాదాపు రూ.21 కోట్లతో తమ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతోందని చెప్పారు. ఎమ్మెల్యే వైవీఆర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్వయంగా తనను పిలిచి గుంతకల్లుకు ఓ మంచి ఆస్పత్రి మంజూరు చేస్తున్నాం, గుత్తి, పామిడి ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు అందిస్తామని చెప్పాడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. గుంతకల్లు అభివృద్ధి పనుల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు ఫైల్‌పై సంతకం చేశారని గుర్తు చేశారు. కరోనా సమయంలో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రజలకు వైద్యం అందిందన్నారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో 4 అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో గుండె ఆపరేషన్లు ప్రారంభం కానున్నాయని, డయాలసిస్ సెంటర్ కూడా జగనన్న మంజూరు చేయనున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంహెచ్ పాల్‌రవికుమార్, ఆర్డీఓ రవీంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ, వైస్ చైర్మన్లు నైరుతిరెడ్డి, మైమున్, ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిప్రసాద్, 9వ వార్డు కౌన్సిలర్ బి.రవీంద్రకుమార్, దివంగత రాయ్‌సాహిబ్ మిడతల హంపయ్య మనవడు హరి, జెడ్పీటీసీ సభ్యుడు కదిరప్ప, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.గాదిలింగేశ్వరబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ జీ.రామాంజినేయులు, వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఎద్దులశంకర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మబు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దేవేంద్రప్ప, మండల కన్వీనర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.


మాతాశిశు సంరక్షణ విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే వైవీఆర్


ఆసుపత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే వైవీఆర్, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. శనివారం వారు ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖితతో కలిసి నాబార్డు నిధులు రూ. 5.80 కోట్లతో నిర్మించిన నూతన కమ్యూనిటీ ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. విద్యా వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ సీఎం జగన్ జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, ఓసీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మెత లక్ష్మీ, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బోయ రామచంద్ర, ఆసుపత్రి వైద్యాధికారి ఎల్లప్ప, ఆరోగ్యమిత్ర బోయ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి జగనన్న అధిక ప్రాధాన్యత

గుత్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో నాడు–నేడు నిధులు రూ.1.95 కోట్లతో నిర్మించిన రెండు భవనాల(ఓపీ, కాన్పుల యూనిట్లు)ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటోందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఆసుపత్రుల అభివృద్ధికి రూ.21 కోట్లు వెచ్చించామన్నారు. గుత్తిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, ఎంపీపీ విశాలాక్షి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సునీలా, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, సచివాలయ పట్టణ, మండల కన్వీనర్లు సుభాష్‌రెడ్డి, రంగస్వామి, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్‌యాదవ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చెవుల మల్లయ్యయాదవ్, జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి బేడల వెంకటరాముడు, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు భీమలింగప్ప, వీసీ దస్తగిరి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరమణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ గోపాల్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు నజీర్, శివ, వరదరాజులు, నరేష్, వెంకట సుబ్బయ్య, కేవీ రమణ, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బ్రిడ్జి పనులు వేగవంతం చేయండి


బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎంపీ రంగయ్య, ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: మండలంలోని తరిమెల నుంచి పెద్దవడుగూరు మండలం చిట్టూరు మధ్య పెన్నానదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలని ఎంపీ తలారి రంగయ్య అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమ యాత్రలో పెన్నానదిలో నడిచారు. తరిమెల బహిరంగ సభలో బ్రిడ్జి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ తలారి రంగయ్య తన నిధుల నుంచి దాదాపు రూ. 3.60 కోట్లు మంజూరు చేశారు. బ్రిడ్జి పనులను శనివారం ఎంపీతో పాటు, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఈరెండు మండలాల మధ్య రాకపోకలు కొనసాగుతాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో శింగనమల, పెద్దవడుగూరు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెస్ పార్క్ ప్రారంభం అభినందనీయం


చెస్ పార్క్‌ను ప్రారంభిస్తున్న కేవీవీ శర్మ

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో మొట్టమొదటి చెస్ పార్క్‌ను గుంతకల్లులో ప్రారంభించడం అభినందనీయమని ఆంధ్రా చెస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉదయ్ కుమార్ నాయుడు తెలిపారు. శనివారం స్థానిక దోనిముక్కల రోడ్డులోని మాంటిస్సోరి స్కూల్ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన చెస్ పార్క్‌ను కేవీవీ శర్మ ప్రారంభించారు. చదరంగం ఆడటం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి, మేధో వికాసం పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున , అనంతపురం కార్యదర్శి ఉదయ్‌కుమార్, సీనియర్ నేషనల్ ఆర్బిటర్ నాగార్జున కర్ణాటకమ్, శ్రీనివాసులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో పోలీసు బందోబస్తు


జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులతో మాట్లాడుతున్న జీఆర్‌పీ ఎస్పీ చౌడేశ్వరి


గుంతకల్లు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును సీఐడీ దర్యాప్తు బృందం అరెస్టు చేయడంతో గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు. జీఆర్‌పీ ఎస్పీ కే.చౌడేశ్వరీ నేతృత్వంలో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు స్టేషన్ ప్రాంగణం, ప్లాట్‌ఫారాల్లో అనుమానితులను తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో జీఆర్‌పీ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, సీఐ నగేష్‌బాబు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బెన్నయ్య, జీఆర్‌పీ లైజన్ ఆఫీసర్ బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో దుర్గాంజనేయ స్వామి

శింగనమల: స్థానిక చెరువు కట్ట వద్ద నున్న దుర్గాంజనేయ లయంలో శ్రావణ మాసం పురస్కరించుకొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం అర్చనలు చేపట్టారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం


మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది

పెద్దవడుగూరు : చిరుధాన్యాల సాగు లాభదాయకంగా ఉంటుందని రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది గిరిబాబు పేర్కొన్నారు. శనివారం దిమ్మగుడి గ్రామంలో పెరటి తోటలు, చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెరటిలో నాణ్యమైన ఆకుకూరలు పండించుకోవచ్చన్నారు. కొర్రలు, రాగులు, జొన్నలు తదితర ధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా రైతులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం నిర్వహించనున్న నాలుగో విడత కౌన్సెలింగ్‌కు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టి.నరేంద్రనాథ్ తెలిపారు. టెన్త్ పాసైన విద్యార్థులు ఈ నెల 19లోపు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ కళాశాలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

యల్లనూరు: మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామకృష్ణ హెచ్చరించారు. శనివారం యల్లనూరు, పెద్దమల్లేపల్లి, మేడికుర్తి, నిట్టూరు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలతో సమావేశం నిర్వహించారు. చిన్న విషయాలకే గొడవలకు దిగకుండా ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

గార్లదిన్నె: పాముకాటుతో ఓ మహిళ అస్వస్థతకు గురైన సంఘటన శనివారం ఎగువపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చిట్టెమ్మ అనే మహిళ ఇంటి సమీపంలో ఉన్న వ్యవసాయదొడ్డిలో పశుగ్రాసం తీసుకురావడానికి వెళ్లింది. అక్కడ మహిళ కాలికి పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చదువుతోపాటు నైపుణ్యం అవసరం

- టీసీఎస్ హెడ్ ఈఎస్ చక్రవర్తి

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులకు చదువుతో పాటు నైపుణ్యం ఎంతో అవసరమని టీసీఎస్ బెంగళూరు హెడ్ ఈఎస్ చక్రవర్తి పేర్కొన్నారు. శనివారం రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆరంభ–2023 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల కరెస్పాండెంట్, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈఎస్ చక్రవర్తి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక, ఇంగ్లిష్ భాషతో కమ్యూనికేషన్ స్కిల్స్‌కు పెంచుకోవాలన్నారు. నైపుణ్యాలు ఉంటే ఉద్యోగాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో తల్లిదండ్రులను గురువులనూ ఎన్నటికీ మరచిపోకూడదన్నారు. జీవితంలో ఎన్ని జరిగినా వ్యక్తిత్వాన్ని మాత్రం కోల్పోకూడదన్నారు. ఎస్ఆర్ఐటీ కళాశాలలో అత్యాధునికంగా వసతులు కల్పించారన్నారు. విద్యార్థులకు ఉద్యోగ నియామకాల్లో కళాశాల చైర్‌పర్సన్, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, కరెస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి చేస్తున్న కృషి అభినందనీయఅన్నారు. ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో చదువతున్న ప్రతి విద్యార్థికీ మంచి భవిష్యత్తు అందించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఏటా వందలాది మంది విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, డీన్ సాయి చైతన్య కిశోర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి,అన్ని విభాగాల అధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.


ఈఎస్ చక్రవర్తిని సన్మానిస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి

లోక్ అదాలత్‌లో 1,172 కేసుల పరిష్కారం

గుంతకల్లుటౌన్: స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి జి.మంజుల ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ జరిగింది. జేఎఫ్‌సీఎం, రైల్వే, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులకు సంబంధించి మొత్తం 1,172 రాజీపడదగిన కేసులు పరిష్కారమైనట్లు కోర్టు అధికారులు తెలిపారు. ఇందులో జేఎఫ్‌సీఎం కోర్టు–48 కేసులు, రైల్వే కోర్టు–527, సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్–576, పీఎల్‌సీ–21 కేసులు పరిష్కరించినట్లు కోర్టు అధికారులు వెల్లడించారు. ఏపీపీ హేమలత, లోక్ అదాలత్ సభ్యులు సి.వెంకటేశ్వర్లు, నాగేషు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ఏడీజే, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లోక్ అదాలత్ నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఏడీజే శోభారాణి, సీనియర్ సివిల్ జడ్జి హరిత, జూనియర్ సివిల్ జడ్జి దీప్తి రాజీకి అవకాశమున్న మొత్తం 605 కేసులను పరిష్కరించారు. ఇందులో ఎస్టీసీ(జరిమానా) 510, సీసీలు 70, యాక్సిడెంట్ 12, సివిల్ 7, పీఎల్‌సీ 3, డీవీసీ 1, ఎంసీ 2 కేసులు ఉన్నాయి. కార్యక్రమంలో ఏపీపీ బుసు సుధీర్‌రెడ్డి, ఏజీపీ తిమ్మారెడ్డి, మాజీ ఏపీపీ ఎంపీ మహేష్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్‌బాబు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మంజుల

తాడిపత్రిలో ప్రశాంత వాతావరణం

తాడిపత్రి అర్బన్: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో తాడిపత్రి నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలను తీసుకున్నామని డీఎస్పీ సీఎం గంగయ్య తెలిపారు. పట్టణంలో పరిస్థితిని ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో టీడీపీ శ్రేణులు చేపట్టిన చిన్న చిన్న ఆందోళనలు మినహా శాంతి భద్రతలకు భంగం కలిగేటటువంటి చర్యలు చోటుచేసుకోలేదన్నారు. ఉదయం నుంచే తమ సిబ్బంది అన్ని రకాల చర్యలను తీసుకున్నారన్నారు. తాడిపత్రిలో ప్రశాంత వాతావరణ నెలకొందని, ప్రజా జీవనానికి ఎలాంటి ఇబ్బందులు కలగులేదన్నారు. ఉదయం డిపోలకే పరిమితమైన ఆర్టీసీ సర్వీసులను డిపో మేనేజర్‌తో మాట్లాడి తిప్పేలా చర్యలు చేపట్టామన్నారు. దీంతో దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదన్నారు. తాడిపత్రికి విచ్చేసిన అడిషనల్ ఎస్పీ రామిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పరిస్థితిని సమీక్షించారు.


కడప రహదారిపై పరిస్థితిని పరిశీలిస్తున్న డీఎస్పీ సీఎం గంగయ్య,సీఐలు లక్ష్మీకాంతరెడ్డి, శంకర్‌రెడ్డి

కమనీయం.. శ్రీనివాస కల్యాణం


అలంకరణలో వేంకటేశ్వరస్వామి


అనంతపురం కల్చరల్: నిజ శ్రావణంలో వచ్చిన చివరి శనివారాన్ని పురస్కరించుకొని పలుచోట్ల శ్రీనివాస కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. స్థానిక శారదా శంకర మఠంలో సత్యప్రసాద్ నేతృత్వంలో వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీవారికి మంగళ హారుతులు ఇచ్చి, పూజలు చేశారు. తపోవనంలోని శివశక్తి షిర్డీసాయిబాబా మందిరంలో సాయిట్రస్టు ఆధ్వర్యంలో శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని మణూరు నాగరాజ శర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న సూర్యానంద స్వామీజీ

గుంతకల్లు రూరల్: ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని సూర్యానంద స్వామీజీ పేర్కొన్నారు. శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థాన ప్రాంగణంలోని రామదూత నిలయంలో విశ్వహిందూపరిషత్, భజరంగదళ్ రాష్ట్ర సమావేశాలు నిర్వహించారు. సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన సూర్యానంద స్వామీజీ సనాతన ధర్మాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు, రాష్ట్ర భజరంగదళ్ కన్వీనర్ ప్రతాపరెడ్డి, రాష్ట్ర సంఘటన మంత్రి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర సేవా ప్రముఖ్ రామూర్తి, భజరంగదళ్ రాష్ట్ర సప్తహిక్ కన్వీనర్ కసాపురం రవి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వార్డు సభ్యుడి మృతి


మృతుడు ఆంజనేయులు

గుత్తి రూరల్: మండలంలోని ధర్మాపురం గ్రామంలో అనారోగ్యంతో వార్డు సభ్యుడు వడ్డే ఆంజనేయులు(60) శనివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామా నికి చెందిన వడ్డే ఆంజనేయులు ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో 4వ వార్డు సభ్యుడిగా గెలుపొందాడు. వడ్డే ఆంజనేయులు కొన్ని నెల లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం గుత్తిలోని ఓ అసుపత్రిలో చికిత్స పొందాడు. అయితే శనివారం ఉదయం అనారోగ్యంతో శ్వాస తీసుకోవడం కష్టంగా మారింది. గమనించిన కుటుంబసభ్యు లు వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడి పరిస్థితి విషమంగా ఉందని సూచించడంతో అనంతపురం తరలిస్తుండగా పామిడి వద్దకు వెళ్లగానే అతడు మరణించాడు. గమనించిన కుటుంబ సభ్యులు పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆంజనేయులు మృతి చెందినట్లు నిర్ధారించారు.

నాటుసారా విక్రేత అరెస్టు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని నంద్యాల రోడ్డులో నాటుసారా విక్రయిస్తున్న అష్రాఫ్ అలియాస్ గోవాను శనివారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. ఈసందర్భంగా నిందితుడి నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

మట్కా బీటర్ అరెస్టు

యాడికి: మండల కేంద్రంలోని కోన సర్కిల్ వద్ద శనివారం మట్కా రాస్తున్న కరుణాకర్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈసందర్భంగా నిందితుడిని నుంచి రూ.18,110 నగదుతో పాటు మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

దివ్యాంగ క్రికెటర్లకు అభినందన

అనంతపురం: డిఫరెంట్లీ ఏబుల్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీసీఐ సపోర్టింగ్ బాడీ) , సనాతన సేవా సంస్థాన్, ఉదయ్‌పూర్ సంయుక్తంగా సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 8 వరకు టీ–20, మూడో జాతీయ స్థాయి దివ్యాంగుల క్రికెట్ టీర్నోమెంట్‌ను ఉదయ్‌పూర్‌లో నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్ గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డులో నమోదు చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు దక్షిణ భారతదేశ చీఫ్ కోఆర్డినేటర్ ఎస్. మధుసూదన్ నాయక్ (ఆర్డీటీ కోచ్) తెలిపారు. టోర్నీలో 24 రాష్ట్రాల నుంచి టీమ్‌లు పాల్గొననున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి దివ్యాంగుల క్రికెట్ జట్టును ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. జట్టులో అనంతపురం జిల్లా నుంచి వెన్నపూస రోసిరెడ్డి, సయ్యద్ నూరుల్లా హుదా ఎంపికయ్యారు. వీరిని ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ సీఈఓ వెంకట శివారెడ్డి, జిల్లా కార్యదర్శి మధు ఆచారి ఆర్డీటీ క్రీడా మైదానంలో శనివారం అభినందించారు.

ఆలూరు కోన రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు

తాడిపత్రి: ఆలూరు కోనలో వెలసిన ఆలూరు కోన రంగనాథస్వామికి శ్రావణ మాసం ఆఖరి శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని రంగనాథ స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వెంకటరెడ్డిపల్లికి చెందిన దివంగత చవ్వా రంగారెడ్డి భార్య పెద్దరంగమ్మ, అల్లుడు, ప్రభుత్వ న్యాయవాది హరినాథరెడ్డి, కుమార్తె భారతి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే పట్టణానికి చెందిన మలిటెడ్డు రంగా రూ. ఆలయానికి 10,116 విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ సుబ్రమణ్యం తెలిపారు. యువనాయకులు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆలూరు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో ఆలూరు కోన శ్రీ రంగనాథ స్వామి

ఘనంగా ఆలయ రజతోత్సవాలు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయ రజతోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో హోమాలు చేపట్టారు. అనంతరం విష్ణు సహస్రపారాయణం చేసి ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం మూడో కాల యాగపూజతో తిరిగి వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఉయ్యాలవాడ రామకృష్ణారెడ్డి మిత్ర బృందం భగవద్గీత పారాయణం, నాడిసంధానం నిర్వహించారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు మహా కుంబాభిషేకాన్ని నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి మహా కుంభాభిషేక వేడుకలకు సిద్ధం చేశారు. వేడుకలకు సుమారు 50వేల మంది భక్తులు హాజరవుతారని నిర్వాహకులు అంచానా వేస్తున్నారు. వీరికి అన్నదానం చేసేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు.


హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా విగ్రహాల ప్రతిష్టాపన


ప్రత్యేక అలంకరణలో పార్వతి దేవి

బుక్కరాయసముద్రం: జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14 బెటాలియన్‌లో శనివారం దుర్గా మల్లేశ్వరస్వామి, పార్వతి, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం బెటాలియన్‌లో నూతనంగా నిర్మించిన ఆలయ ప్రాంగణంలో దేవతా యంత్రస్థాపన, ప్రాణ ప్రతిష్ఠ, కుష్మాండ బలి, మంగళ హారతి, కలశ స్థాపన, సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ కమాండెంట్ ప్రకాష్, ఏపీఎస్పీ 14వ బెటాలియన్ అడిషనల్ కమాండెంటెడ్ నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ రమణమూర్తి, దామోదర్‌రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రాము, లోకేశ్వర నాయుడు, రామారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవం


పౌష్టికాహార ప్రాముఖ్యత వివరిస్తున్న సిబ్బంది

పామిడి: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–4, 5తో పాటు తగ్గు దేవాలయం, ఎద్దులపల్లిరోడ్డు, సంతమార్కెట్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. తాజాగా దొరికే కూరగాయాలు, ఆకుకూరలు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు భారతి, యశోద, త్రివేణి, రజని, రెహనాజ్, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.